పుట : 18-20, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## అపాయంలో - ఉపాయం

ఒక సముద్ర తీరంలో, రామన్న అనే ఒక బెస్తవాడూ, అతని భార్య ఒక చిన్న గుడెసెలో కాపురముంటూండేవారు. వారు ఆరుగురు సంతానంతో హాయిగా, సుఖంగా కాలం గడుపుతుండెడివారు. రామన్న అందరి బెస్తవాళ్ళల్లాగా కాకుండా, తనకున్న దానితోనే తృప్తిపడి, కాలాన్ని గడిపేసేవాడు. అంతేకాకుండా, రోజుకు రెండు సార్లు మాత్రమే వలవేసి, ఆ వలలో వచ్చే చేలనే అమ్ముకుని తృప్తిపడేవాడు.

ఇలా వుండగా ఒకనాడు ఉదయాన్నే రామన్న వల తీసుకుని సముద్రానికి బయలుదేరాడు. మామూలు ప్రకారము సముద్రంలోకి వల విసిరాడు. కొంత సేపటికి వలలో బరువుగా చిక్కుకున్నట్లయింది. ''అమ్మయ్యా! ఇవ్వాళ పెద్ద చేపే దొరికింది. అంటే, ఈ రోజు చాలా బావుందన్నమాట!'' అని సంతోషపడి, ఎలాగో కష్టపడి, ఆ వలని బయటికి లాగాడు.

కానీ తీరా చూస్తే, అది ఒక పెద్దరాయి. ''అయ్యో! ఇది రాయా!'' అని అనుకుని, దానిని ఒక ప్రక్కకు పడేసి మళ్ళీ వల వేశాడు. కానీ, ఎంత సేపటికీ వలలో చేపలు పడలేదు.

''అదేమిటి ఖర్మ? ఇవ్వాళ ఒక్క చేపా పడలేదు! నేనూ, పిల్లలూ, ఈ పూట ఎలాగ గడిపేది?'' అని అనుకుని విచారంగా కూర్చున్నాడు. మిట్టమధ్యాహ్నము కావచ్చింది. ఎండ, మంటలు కక్కుతోంది. కానీ, ఒక్క చేపా దొరకటము లేదు. చివరికి విసిగెత్తి వెళ్ళిపోదామనుకుంటూండగా, వలలో ఏదో బరువుగా తగిలినట్లయింది. ఈసారి నిజంగా పెద్ద చేపనని, ఆశగా పైకి చూశాడు. కానీ, అది చేపకాదు. అది ఒక పెద్ద ఇనప కూజా! అది చూసి, ''అయ్యో! ఈసారి కూడా చేప రాలేదు. పాడు కూజా తగలబడిరది'' అని తిట్టుకుని, ఆ కూజాని వలలోంచి తీసి దూరంగా విసిరేశాడు.

విచారంగా వెనక్కు తిరిగాడు. రెండు మూడు అడుగులు వేసే సరికి, రామన్నకి, ''పోనీ! ఆ ఇనప కూజానే అమ్ముకోవచ్చుకదా! అది అమ్ముకున్నా ఈ పూట గడిచిపోతుంది'' అన్న ఆలోచన వచ్చింది. వెంటనే వెనక్కు వెళ్ళి ఆ కూజాని తీసుకున్నాడు మళ్ళీ రెండడుగులు వేసేసరికి, ఆ కూజాలో ఏముందో చూడాలన్న బుద్ధి పుట్టింది రామన్నకి. గట్టిగా బిగుసుకుపోయిన ఆ కూజా మూతను ఎలాగో కష్టపడి తీశాడు. మూత తీసిన వెంటనే, కూజాలోంచి పొగరావటం మొదలుపెట్టింది. ఆ పొగ క్రమక్రమంగా పెరిగి, ఒక పెద్ద రాక్షసుడుగా మారి రామన్న ముందు ప్రత్యక్షమయ్యాడు.

రామన్న రాక్షసుడ్ని చూసి గజగజా వణకసాగాడు. రామన్నని చూసి ఆ రాక్షసుడు వికటంగా గట్టిగా నవ్వుతూ, ''ఒరేయ్, నరుడా! ఈనాటితో నీకు చావూ, నాకు విముక్తి కలిగిందిరా. ఎలా చావాలని కోరుకుంటున్నావో కోరుకో'' అన్నాడు.

రామన్న ప్రాణాలు గడగడలాడాయి అప్పుడు, ఎలాగో ధైర్యం తెచ్చుకుని ''అయ్యా! రాక్షసుడా ఇది నీకు న్యాయమేనా? నిన్ను కూజాలోంచి విడిపించి, విముక్తి, కలిగించినందుకు నన్ను చంపేస్తానంటున్నావా? ....... ఇదేనా నువ్వు నాకిచ్చే బహుమానము? ఇదెక్కడి న్యామయ్యా?'' అన్నాడు జాలిగా బ్రతిమలాడుతూ.

దానికి రాక్షసుడు, ''ఓరి పెర్రివాడా, నీవు చెప్పినది నిజమే! కానీ, నా ప్రతిజ్ఞ కూడా కొంచెం విను. నేను ఈ కూజాలో వెయ్యేళ్ళనుంచీ బంధింపబడి ఉంటున్నాను. మొదట నన్ను విడిపిస్తే, విడిపించిన వారికి, జన్మజన్మలకూ దాసునిగా వుండి వారి రుణం తీర్చుకోవాలనుకున్నాను. కానీ నన్నెవ్వరూ విడిపించలేదు.

తర్వాత, కొన్నేళ్ళకు విసుగువచ్చి నన్ను ఈ కూజా నుంచి విడిపించిన వారిని, ఈ రాజ్యానికి రాజును చేస్తాను అని ఒట్టు  పెట్టుకున్నాను. అయినా నన్నెవరూ ఈ కూజా నుంచి విముక్తి కలిగించలేదు.

తర్వాత యింకోన్నేళ్ళకి, పోనీ, ఎవరయినా నన్ను యీ కూజా నుంచి విడుదల చేసి రక్షిస్తే రక్షించిన వారికి, కోరిన కోరికలన్నీ తీర్చుతాననుకున్నాను. అయినా ఎవ్వరూ నన్ను రక్షించలేదు.

చివరికి ఒళ్ళు మండి, కోపం వచ్చి నన్ను ఎవరయితే, ఈ కూజా నుంచి బయటికి తీస్తారో, వారిని చంపి ఆహారంగా తినేస్తాను, అని నిశ్చయించుకున్నాను. అలా అనుకున్న కొన్నాళ్ళకే నువ్వు, నన్ను ఈ కూజా నుంచి విడిపించి, బంధ విముక్తి కలిగించావు. ఆఖరు నిర్ణయం ప్రకారం నిన్ను చంపేస్తాను'' అన్నాడు.

ఆ మాటలతో రామన్నకి ఇక ప్రాణాలపైన ఆశ వదిలిపోయింది.అయినా, అంతటి అపాయంలోను, ఒక మంచి ఉపాయం వచ్చింది. వెంటనే రాక్షసుడ్ని చూసి, ''నువ్వు నన్ను ఎలా చంపినా పర్వాలేదు, కానీ నాకు చివరిగా ఒకే ఒక్క కోరిక వుంది. అది తీర్చి నన్ను నీ ఆహారంగా ఆనందంగా తిను'' అన్నాడు బ్రతిమిలాడుతున్నట్లుగా.

''సరే, ఒకే ఒక్క కోరిక అంటున్నావు కనుక అది తీర్చి, నిన్ను నా ఆహారంగా తింటాను. ఏమిటి మీ కోరిక?'' అన్నాడు ఆ రాక్షసుడు.

‘‘అదే నిన్ను చూస్తే ఇంత పెద్ద శరీరం వుంది. వెయ్యేళ్ళబట్టీ, ఈ చిన్న కూజాలో ఉంటున్నావంటున్నావు. ఎలాగున్నావో, నాకేమీ అర్థం కావటం లేదు. అసలు నువ్వు అందులో సరిపోవు కదా!’’ అన్నాడు రామన్న అనుమానాన్ని నటిస్తూ.

‘‘ఓస్ ఇంతేనా? ఒట్టి పెర్రివాడిలా వున్నావు. ఆమాత్రం తెలియదా? ఇదేనా నీకున్న చివరి కోరిక?....., అయితే చూడు, ఇన్నాళ్ళబట్టీ అందులో ఎలాగున్నానో!’’ అంటూ గర్వంగా, మళ్ళీ పొగ రూపంలో ఆ జాడీలాంటి కూజాలోకి దూరాడు.

రామన్న వెంటనే గబగబా జాడీ మూత గట్టిగా బిగించేశాడు. ‘‘పెదవా నిన్ను రక్షించినందుకు నాకు బహుమానము ఇచ్చేదిపోయి నన్ను చంపేస్తానంటావా? అందుకే తగిన శాస్తి చేశాను’’ అంటూ గర్వంగా, నవ్వుకుంటూ ఆ రాగి జాడీని సముద్రంలోకి దూరంగా విసిరేశాడు. అందుకనే, ‘అపాయంలో ఉపాయం’ కావాలంటారు పెద్దలు.